## క్లుప్తంగా

### సమాజ సేవకు చేయూత

**చీరాల టౌన్:** పేద ప్రజల ఆరోగ్యానికి, సమాజ సేవా కార్యక్రమాలకు, విద్యాభివృద్ధికి శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ చేయూతనందిస్తుందని ట్రస్ట్ అధినేత స్వామీ రామానంద సరస్వతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఈపురుపాలెం పద్మనాభునిపేటలోని శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి దేవాలయంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చెక్కులు పంపిణీతో పాటు, దేవాలయం అభివృద్ధి, కళ్యాణ మండపం నిర్మాణానికి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, జెడ్పీటీసీ ఎ.పద్మిని, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఉపాధి పనులు ఉపయోగించుకోండి

**జె.పంగులూరు:** పంగులూరు మండలంలోని ఉపాధి హామీ పథకంను కూలీలు ఉపాధి పనులను ఉపయోగించుకొని ఆర్థికంగా బలపడాలని పంగులూరు మండల ఏపీఓ కె. సంతోషం కోరారు. బుధవారం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని, కూలీలు ఉదయం సమయంలో పనికి రాలేకపోతే సాయంత్రం మూడు గంటల నుంచి 6 గంటల వరకు పని చేసుకోవాలని అన్నారు. ఉపాధి పనికి రాదలిచిన కూలీలు వారి ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి డిమాండ్ ఇవ్వాలని, అలా డిమాండ్ ఇచ్చినవారు పనికి వెళ్ళివచ్చని అన్నారు. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 3,65,058 పని దినాలు మంజూరైనట్లు ఈ పనిదినాలు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### చలివేంద్రం ప్రారంభం



కారంచేడులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

**కారంచేడు:** మండల కేంద్రమైన కారంచేడు ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం వద్ద బుధవారం తహసీల్దార్ జి. నాగరాజు, ఎంపీడీఓ కె. నేతాజీ చలివేంద్ర ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారులు, వృద్ధులు, చిన్నపిల్లలకు వడదెబ్బలు తగలకుండా ఉండేందుకు వసరమైన తాగునీటిని అందించాలనే సంకల్పంతో ఈ చలివేంద్రను ఏర్పాటు చేయించామని చెప్పారు. తమ కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డీటీ అనిత, కంభంపాటి నరేంద్ర, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

### ఘనంగా అమ్మ అనాథ ఆశ్రమ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న రావుల బాపయ్య చౌదరి, మాధవీలత

**మార్టూరు:** వృద్ధులు, అనాథలకు అన్నదానంతో పాటు అనేక సౌకర్యాలు నిరా టంకంగా కల్పిస్తున్న అమ్మ అనాథ ఆశ్రమ ఆరో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. 2020 ఏప్రిల్ 9వ తేదీ ఒక అద్దె గృహంలో ప్రారంభమై అనేకమంది దాతల సాయంతో సొంత భవనాన్ని నిర్మించుకుని నిర్వాహకులు గుంటుపల్లి చందు దంపతులు అన్నార్తులకు సహాయపడటం విశేషం. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు రావుల బాపయ్య చౌదరి, కోలలపూడి పశు వైద్యురాలు ఎన్. మాధవి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ప్రతాప నాగరాజు, పెంటేల రామారావు ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

### గర్భిణులను పర్యవేక్షించండి



స్వర్ణలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ శాలిని

**స్వర్ణ(కారంచేడు):** ప్రసవ సమయం వరకు గర్భిణులను పర్యవేక్షించాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ షాలిని, డాక్టర్ హస్మప్రియ అన్నారు. బుధవారం మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) ద్వారా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 18 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి క్రమం తప్పకుండా వారికి అందాల్సిన వైద్య సేవలను గుర్తు చేయాలన్నారు. నెలకు ఒక సారి వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన స్కానింగ్‌లు చేసి బిడ్డ ఎదుగుదల విషయంలో వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ప్రసవ సమయానికి ముందే ఆశాలు.. వైద్యశాలకు పంపించే ఏర్పాట్లు చేస్తారన్నారు. ఎంపీహెచ్ఈఓ వి. నాగేశ్వరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఏఎన్ఎంలు, ఆశలు, స్వర్ణ, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాలకు చెందిన గర్భిణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మోగిన ఎన్నికల నగారా!

- చీరాల బార్ అసోసియేషన్‌కు ఎన్నికల షెడ్యూలు విడుదల
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 201 మంది న్యాయవాదులు
- నేడు నామినేషన్లు.. 15న ఎన్నికల నిర్వహణ



చీరాలలోని కోర్టు ప్రాంగణం

**చీరాల రూరల్:** నియోజకవర్గ కేంద్రం చీరాల్లోని బార్ అసోసియేషన్‌కు సంబంధించి ఎన్నికల నగారా మోగింది. ఇప్పటికే జిల్లాలో ఒంగోలు బార్ మినహా అన్ని బార్ అసోసియేషన్లకు ఎన్నికలు నిర్వహించారు. చీరాలకు సంబంధించి చీఫ్ ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది కరేటి రవికుమార్ రెడ్డి, అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా ఆసాది సత్యనారాయణ రెడ్డి, బోయిన రమేష్‌బాబు, అందె వెంకటేశ్వరరావు, ఎ. విష్ణువర ప్రసాదరావు నియమితులయ్యారు. దీంతో వారు సోమవారం ఎన్నికల షెడ్యూలు విడుదల చేశారు. చీరాల బార్ అసోసియేషన్‌లో 201 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. చీరాల బార్‌లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, లైబ్రరీ సెక్రటరీ, ట్రెజరీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ, మహిళా ప్రతినిధి పోస్టులకు ఎన్నికలు జరగనున్నాయి. గురువారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు పోటీలో నిలిచే అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 2:30 గంటలకు నామినేషన్లను స్క్రూటినీ చేస్తారు. 12వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లు ఉపసంహరణ. అదేరోజు పోటీలో నిలిచే అభ్యర్థులతో కూడిన ఫైనల్ లిస్ట్ ప్రదర్శన ఉంటుంది. 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

**జోరుగా అభ్యర్థుల ప్రచారం**

సీనియర్ న్యాయవాది కొమ్మనబోయిన నాగేశ్వరరావు ఈ ఏడాది బార్ అసోసియేషన్ అధ్యక్షుని రేసులో నిలిచి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు రెండు పర్యాయాలుగా పదవిలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం మూడోసారి కూడా పోటీ చేస్తున్నారు. ఉపాధ్యక్ష, జనరల్ సెక్రటరీ, మహిళా ప్రతినిధి పదవి కోసం అభ్యర్థులు పోటీ పడి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం కూడా మొదలుపెట్టారు. ఈఏడాది మార్చి 31వ తేదీతో పాత పదవులన్నీ రద్దుచేస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఈనెల 15న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వానుబాబు



సమావేశంలో పాల్గొన్న పాలకులు, అధికారులు

**కారంచేడు:** అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన గిట్టుబాటు ధరలు కల్పించలేకపోతున్నాయని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే నేపథ్యంలో ప్రజలకు, పశువులకు అవసరమైన తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డ్వాక్రా రుణాలు మంజూరు చేయడంలో ఇడుపులపాడు బ్యాంక్ మేనేజర్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తిమిడెదపాడు ఎంపీటీసీ సభ్యురాలు వీరమ్మ తెలిపారు. స్పందించిన ఏపీఎం మోహనరావు.. మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించిన యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలను పునఃప్రారంభించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు ప్రశ్నించారు. సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

**వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా బాయ్‌కాట్**

ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు బిల్లును ప్రవేశపెట్టిందని మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్ సభ నుంచి బాయ్‌కాట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా వంత పాడిందన్నారు. ఈ బిల్లుకు కనీసం ముస్లిం మత పెద్దలను సంప్రదించలేదన్నారు. ఈ బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల పని తీరును వివరించారు. ఎంపీడీఓ కె. నేతాజీ, డీటీ అనిత, ఎంపీటీసీ సభ్యులు, గ్రామసర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన



ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

**చీరాల టౌన్:** బీసీ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టారు. ఎంపీడీఓ బి.శివ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హత, ఆధార్, ఏర్పాటు చేయనున్న యూనిట్ వివరాలు వంటివి పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం చీరాల మండలానికి బీసీ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు మండలానికి 90 యూనిట్లును మాత్రమే కేటాయించగా దరఖాస్తులు మాత్రం 621 వచ్చాయన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి బ్యాంకు సిబిల్ రేటు, ధ్రువీకరణ పత్రాలను బ్యాంకు మేనేజర్ల సమక్షంలో మండల పరిషత్ అధికారులు చేపట్టారు. మండలానికి కేటాయించిన 90 యూనిట్లు బీసీ, ఈబీసీ సబ్సిడీ రుణాలకు రూ.1.69 కోట్లు బ్యాంకు మేనేజర్లు రుణాలను అందిస్తారన్నారు. మండల ఎంపిక కమిటీ తుది జాబితాను రూపొందిస్తుందని ఎంపీడీఓ వివరించారు.

## విద్యార్థులను కళాశాలలో చేర్పించండి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**బల్లికురవ:** ఇంటి భోజనంతో పాటు ఒత్తిడిలేని విద్యను అందిస్తున్న బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ బిడ్డలను చేర్పించాలని ప్రిన్సిపాల్ కె. సుధాకర్ కోరారు. బుధవారం క్యాంపెయిన్‌లో భాగంగా చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు గ్రామాల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీతో పాటు తరగతులు నిర్వహిస్తున్నామని మొదటి సంవత్సరం విద్యార్థులకు బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో పదో తరగతి పరీక్ష రాసిన హాల్ టిక్కెట్‌లతో అడ్మిషన్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఆధునిక వసతులతో ల్యాబ్, విశాలమైన క్రీడామైదానం, పల్లె వాతావరణంలో అనుభవనీయులైన అధ్యాపకులు పర్యవేక్షణలో ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు వివరించారు. గత విద్యా సంవత్సరం నుంచి బల్లికురవ కళాశాలకే పరీక్ష కేంద్రాన్ని కూడా మంజూరు చేస్తుందని, తక్కువ ఖర్చుతో విద్యను అభ్యసించేందుకు మంచి అవకాశం ఉందని చెప్పారు.

## పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

**బల్లికురవ:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం అద్దంకి పట్టణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాన్ని మోపుతున్నారన్నారు. వంట గ్యాస్ ధరలను రూ. 50 అదనంగా పెంచిందని చెప్పారు. అదేవిధంగా పెట్రోలు డీజిల్ పై విధించిన 2 శాతం పన్నులను కూడా వెనక్కు తీసుకోవాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు వైఖరిని ఖండించాలన్నారు. పార్టీ సభ్యుడు డి. గంగాధర్‌ఫ్రూట్స్ వెండర్స్ కార్యదర్శి తోట వెంకటేశ్వర్లు, రావులపల్లి కోటేశ్వరరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్టూరులో ఉరుసు మహోత్సవం రేపు



హజరత్ కరీముల్లా షా వలి దర్గా

**మార్టూరు:** మార్టూరులోని హజరత్ కరిముల్లా షావలి దర్గా 49 వ ఉరుసు ఉత్సవాన్ని ఈనెల 11వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ప్రకటన తెలిపారు. ఉరుసు సందర్భంగా నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి తరలిరానున్న భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి మత పెద్దల ప్రత్యేక ప్రార్థనల అనంతరం గ్రామంలో గంధం ఊరేగింపు జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### భూసార పరీక్షలతో ఉపయోగం

**బల్లికురవ:** వేసవిలో భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి రైతులకు సూచించారు. ఖరీఫ్ పంటల సాగుకు ముందు భూసార పరీక్షలతో భూమిలో ఏ పోషకాలున్నాయో.. లోపాలు ఏమిటో సులభంగా గుర్తించవచ్చన్నారు. భూసార పరీక్షల వల్ల చౌడు భూములను కూడా గుర్తించవచ్చని చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము మెట్ట, మాగాణి భూముల్లో ఖరీఫ్ పంటల ఆరంభానికి ముందు సాగుచేస్తే భూసారం పెంచుకోవటంతో పాటు, ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చని కుమారి వివరించారు.

### విద్యుత్ చౌర్యం నేరం



మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

**వేటపాలెం:** రూరల్ పరిధిలో విజిలెన్స్ ఎస్ఈ విజయవాడ విజయకృష్ణ, ఆపరేషన్ ఈఈ కె. జాన్ థామస్, విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చీరాల డివిజన్ విద్యుత్ సిబ్బంది 34 బృందాలుగా ఏర్పడి 3101 సర్వీసులు తనిఖీ చేసినట్లు తెపారు. అధికంగా లోడు వినయోగించినవారిపై 93 కేసులు, మాల్ ప్రాక్టీస్ 13 కేసులు, విద్యుత్ చౌర్యం ఒక కేసు మొత్తం 110 కేసులకు సంబంధించి రూ.5,19,000 జరిమానా విధించినట్లు తెలిపారు. అదనపులోడు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి వినియోగదారులకు 50 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. ఒక కిలో వాట్ లోడు క్రమబద్ధీకరణ కోసం గృహ వినియోగదారులు చార్జీల కింద విద్యుత్ శాఖకు రూ. 2 వేలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఇప్పుడు రూ. 1000 చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. వేటపాలెం డీఈఈ జె. శ్రీనివాసులు చీరాల డీఈఈ హరిప్రసాద్, పర్చూరు డీఈ ఎస్. రమేష్, వేటపాలెం రూరల్ ఏఈఈఈ వి. భాస్కర్ పాల్గొన్నారు.

## సంఘాల అభివృద్ధి ముఖ్యం

**చీరాల టౌన్:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని వెలుగు ఏపీఎం కె.మధుసూదన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో ఏపీఎం సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి నెలా 10వ తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలని కోరారు.

### పండుగలు దేశ సంస్కృతిలో భాగం

**చినగంజాం:** పండుగలు, సంప్రదాయాలు భారత దేశ సంస్కృతిలో ముఖ్య భాగం అని ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఊరూరా జనవిజ్ఞానం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో చినగంజాం రైల్వేగేట్ సెంటర్ వద్ద నిర్వహించిన సమావేశానికి మర్కాపురం వెంకట రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల శాఖ ప్రారంభించి అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులను నియమించారు. కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మన పండగలు, సంప్రదాయాలు, అభ్యుదయ ప్రజా దృక్పథం కలిగి ఉండాలన్నారు. అంజలీదేవి సీతమ్మ వారుగా నటించిన మహోన్నత చిత్రం లవకుశ నాటికి, నేటికి చారిత్రాత్మకం అన్నారు. సుమారు 10, 15 తెలుగు సినిమాలు రామాయణం కథాంశంగా వచ్చాయన్నారు. శోభన్‌బాబు, చంద్రకళ సీతారాములుగా బాపు రమణలు 1972లో తీసిన సంపూర్ణ రామాయణం, 2011లో బాలకృష్ణ శ్రీరాముడుగా శ్రీరామరాజ్యం మరో చరిత్రగా నిలిచాయని కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మరుప్రోలు రత్నారెడ్డి, కార్యదర్శి కుక్కల శ్రీరామచంద్రమూర్తి రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు దేవెళ్ళ వెంకయ్య, చినగంజాం మండల కమిటీ సభ్యులు బెల్లంకొండ రమేష్ బాబు, ముప్పల వెంకట సుబ్బారావు, కుక్కల కృష్ణారెడ్డి, మాచవరం నటరాజ్, పిల్లి శ్రీనివాసరావు, వలివేటి శేఖర్, ఆట్ల అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్, జ్యోతిరావు పూలే పై నేడు పోటీ పరీక్షలు

**అద్దంకి రూరల్:** ఈనెల 14న బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్, జ్యోతిరావు పూలేపై గురువారం వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవాల కమిటీ కన్వీనర్ అంకం కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. పోటీల కరపత్రాన్ని తహసీల్దార్ శ్రీచరణ్ ఆవిష్కరించారు.

### లారీ ఢీకొని యాచకుడు మృతి

**మేదరమెట్ల:** రోడ్డు దాటుతున్న యాచకుడిని ఓ గూడ్స్ క్యారియర్ లారీ ఢీకొన్న సంఘటన బుధవారం మేదరమెట్ల పైలాన్ వద్ద చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన యాచకుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ యాచకుడు మృతి చెందినట్లు మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

## అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద పోలీసులు

**చీరాల అర్బన్:** పట్టణ అభివృద్ధే లక్ష్యంగా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం స్థానిక కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పట్టణంలోని వార్డుల్లో చేపట్టనున్న పలు అభివృద్ధికి సంబంధించిన పనులు, 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులను అజెండాలో చేర్చారు. పట్టణ అభివృద్ధికి దోహదపడే అంశాలు మొత్తం 41 అంశాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సమావేశం ప్రారంభమైన పది నిమిషాలకు అజెండాలోని అంశాలను ఆమోదించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ డీఈ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**పోలీస్ బందోబస్తు మధ్య..**

చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు గత కొన్ని నెలలుగా పోలీస్ బందోబస్తుతో నిర్వహిస్తున్నారు. చీరాల మున్సిపాలిటీలో కొంత కాలంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లు మధ్య వాదోపవాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనికి తోడు కొంతమంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు పలికారు. ఈ నేపథ్యంలో చీరాల మున్సిపల్ కౌన్సిల్ పీఠాన్ని కైవశం చేసుకునేందుకు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అవిశ్వాసం తీర్మానం పెడితే పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావుతో పాటు ఇద్దరు ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బందితో పహారా కాశారు. కార్యాలయంలోకి ఇతర వ్యక్తులు వెళ్ళకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రజా సమస్యలపై గళం వినిపించే కౌన్సిల్ సమావేశం పోలీసుల పహారాలో జరగడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు.

## వెంకట సుబ్బమ్మకు నివాళి



చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న హనిమిరెడ్డి, నాయకులు

**అద్దంకి:** వైఎస్సార్ సీపీ అద్దంకి మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి వెంకసుబ్బమ్మకు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆమె దశ దిన కర్మకు హాజరై చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పట్టణ నాయకులు, మండల నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులున్నారు.

**కొరిశపాడు నాయకులకు పరామర్శ**



కొరిశపాడు వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శిస్తున్న పానెం హనిమిరెడ్డి

**మేదరమెట్ల:** కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంలో ఇటీవల పితృవియోగం పొందిన కొరిశపాడు మాజీ ఎంపీపీ అన్నెం అంజిరెడ్డిని, ఇటీవల సోదరుడు మరణించిన వైస్ ఎంపీపీ పులి శ్రీను కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి బుధవారం పరామర్శించారు. ఎ మండల కన్వీనర్ పాలపర్తి శ్రీధర్,మండల నాయకులు పాల్గొన్నారు.

### వివాహ పరిచయ వేదిక కరపత్రావిష్కరణ

**చినగంజాం:** నాయీ బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక కరపత్రం ఆవిష్కరణ నాయి బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్కాపురం వెంకట రామారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక భావన్నారాయణ స్వామి కళ్యాణ మండపంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పతకమూరి మధుబాబు, నాయకులు కందుకూరి చంద్రమౌళి, సీతారామయ్య, నాదెండ్ల రాఘవ,అన్నంగి సురేష్, చకొండ పాటూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.